


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
23 సెప్టెంబర్ 2024
పేజీలు: 02



## టీడీపీని తిరుగులేని శక్తిగా మారుస్తాం: చంద్రబాబు

పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. త్వరలోనే పోస్టుల భర్తీ చేపడతామని పేర్కొన్నారు. కూటమిలోని మూడు పార్టీల్లో కష్టపడ్డ నేతలకు ప్రాధాన్యమిస్తామని అన్నారు. టీడీపీకి కార్యకర్తలే బలమని, వారి త్యాగాలను మర్చిపోలేమన్నారు. కార్యకర్తల ప్రమాద బీమాను రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచినట్లు చెప్పారు. 2029 నాటికి టీడీపీని తిరుగులేని శక్తిగా మారుస్తామన్నారు.



## రేవంత్ రెడ్డిని కలిసిన సూపర్ స్టార్ మహేష్ బాబు

వరద బాధితుల కోసం రేవంత్ రెడ్డిని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం రూ.50 లక్షల చెక్కును అందజేసిన మహేష్ బాబు, నమ్రత.

## మిస్ యూనివర్స్ ఇండియా 2024గా
# రియా సింఘా

ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని రియా సింఘా సొంతం చేసుకున్నారు. జైపుర్ వేదికగా జరిగిన 'మిస్ యూనివర్స్ ఇండియా 2024' పోటీల్లో రియా గెలుపొందారు. 2015లో మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకున్న ఊర్వశీ రౌతేలా ఈ ఈవెంట్‌కు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ ఏడాది మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని రియా గెలుచుకోవడంపై ఊర్వశీ సంతోషం వ్యక్తంచేశారు. మిస్ యూనివర్స్ ఇండియా పోటీల్లో విజేతగా నిలవడం ఆనందంగా ఉందని రియా అన్నారు. 'ఈ రోజు నేను టైటిల్ గెలుచుకోవడం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. ఈ పోటీలో పాల్గొనడం కోసం ఎంతో కష్టపడ్డాను. ఈ స్థాయికి చేరుకోవడం వెనక చాలా కృషి ఉంది. గతంలో ఈ పోటీల్లో గెలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకున్నాను' అన్నారు. ఈసందర్భంగా ఊర్వశీ మీడియాతో మాట్లాడుతూ.. 'గ్లోబల్ మిస్ యూనివర్స్ 2024లో భారత్‌కు రియా ప్రాతినిధ్యం వహించనుంది. రియా ఆ పోటీల్లోనూ విజేతగా నిలవాలని నేను కోరుకుంటున్నాను. ఈ పోటీల్లో పాల్గొన్న అమ్మాయిలంతా ఎంతో కష్టపడ్డారు. వారి అంకితభావం ఆశ్చర్యపరిచింది' అన్నారు. గుజరాత్‌కు చెందిన రియా సింఘా 18 ఏళ్ల వయసులోనే ఈ అందాల పోటీల్లో గెలిచి అందరినీ ఆకర్షించారు.






## మహిళలకు ఫ్రీ బస్సు.. మంత్రి కీలక ప్రకటన

మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి విధివిధానాలు రూపొందిస్తున్నామన్నారు. దీపావళి నుంచి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి రూ.5-10 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. అటు అన్న క్యాంటీన్ల ద్వారా ఆకలి కేకలు లేకుండా పేదలకు మూడు పూటలా ఆహారం అందుతుందన్నారు.



## తిరుమల శ్రీవారి ఆలయంలో శాంతి హోమం

శ్రీవారి లడ్డూ కల్తీ ఘటన నేపథ్యంలో ఆలయంలోని యాగశాలలో అర్చకులు శాంతి హోమం చేస్తున్నారు. కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ఉదయం 10 గంటల వరకు తితిదే శాంతి హోమం నిర్వహించనుంది. ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూకు వాడే ఆవు నెయ్యిలో దోషం వల్ల అపచారం కలిగిందన్నారు. దీనికి ప్రాయశ్చిత్తంగా హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హోమం తర్వాత అన్ని పోటుల్లో సంప్రోక్షణ చేస్తామన్నారు. శాంతి హోమం ముగిశాక పండితులు పూర్ణాహుతి నిర్వహించనున్నారు. పూర్ణాహుతి తర్వాత ఆలయం సహా అన్ని పోటుల్లో పంచగవ్య సంప్రోక్షణ చేయనున్నారు. బూందీ పోటు, లడ్డూ పోటు, అన్నప్రసాదం పోటులో పంచగవ్య సంప్రోక్షణ చేపడతారు.

# ఇండియా గోల్డెన్ హిస్టరీ

ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు

ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సరికొత్త చరిత్రను లిఖించాయి. రెండు విభాగాల్లోనూ భారత్ అగ్రస్థానాన నిలిచి స్వర్ణాలు గెలుచుకుంది. బుడాపెస్ట్ వేదికగా జరిగిన 45వ చెస్ ఒలింపియాడ్ ఓపెన్ విభాగంలో దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద రమేశ్‌బాబు, విదిత్ గుజరాతితో పాటు తెలంగాణ యువ గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసితో కూడిన భారత జట్టు 3.5-0.5తో స్లోవేనియాను ఓడించి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. యూఎస్‌ఏ, ఉజ్బెకిస్థాన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్‌బాబు, దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ బృందం 3.5-0.5తో అజర్‌బైజాన్‌ను చిత్తు చేసింది. కజకిస్థాన్, యూఎస్‌ఏ రజతం, కాంస్యం గెలిచాయి. 97 ఏండ్ల ఈ టోర్నీ చరిత్రలో స్వర్ణం గెలవడం భారత్‌కు ఇదే ప్రథమం. మెన్స్ కేటగిరీలో 2014, 2022 ఎడిషన్లలో భారత్ కాంస్యం గెలవగా ఉమెన్స్ కేటగిరీలో 2022లో కాంస్యం దక్కడమే ఇప్పటిదాకా అత్యుత్తమ ప్రదర్శన. ఒక చెస్ ఒలింపియాడ్ ఈవెంట్‌లో ఒకే దేశానికి (ఓపెన్, ఉమెన్) రెండు స్వర్ణాలు రావడం ఈ టోర్నీ చరిత్రలో ఇది రెండోసారి మాత్రమే. సుమారు 190 దేశాలు పోటీపడ్డ చెస్ ఒలింపియాడ్‌లో భాగంగా భారత్ అపజయమే లేకుండా టైటిల్‌ను గెలిచింది. 11 రౌండ్లు ఉండే ఈ టోర్నీలో భారత పురుషుల బృందం వరుసగా 8 రౌండ్లు గెలిచింది. 9వ రౌండ్‌ను (ఉజ్బెకిస్థాన్) డ్రా చేసుకోగా 10వ



రౌండ్‌లో టాప్‌సీడ్ అమెరికాను ఓడించింది. 11 రౌండ్లకు గాను భారత్ ఖాతాలో 21 పాయింట్లు (రౌండ్‌కు 2) దక్కడం విశేషం. మహిళల జట్టూ వరుసగా 8 రౌండ్లు నెగ్గి 9వ రౌండ్‌ను డ్రా చేసుకుంది. తిరిగి 10, 11 రౌండ్లలో పైచేయి సాధించింది. 11 రౌండ్లలో అమ్మాయిలు 19 పాయింట్లు దక్కించుకున్నారు.



## టికెట్ లేని ప్రయాణికులపై ఫోకస్

పండుగల సమయాల్లో టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించే వారిపై రైల్వేశాఖ ఫోకస్ పెట్టింది. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిలో ఎక్కువగా పోలీసులే ఉన్నట్లు గుర్తించిన రైల్వే వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. అలాంటి వారిపై రైల్వే యాక్ట్ 1989 ప్రకారం చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం వచ్చే నెల 1 నుంచి 15 వరకు, 25 నుంచి నవంబర్ 10 వరకు తనిఖీలు నిర్వహించనుంది.

## మేం నాలుగోసారి అధికారంలోకి వస్తామన్న హామీ ఇవ్వలేను కానీ..

### తోటి మంత్రిపై నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు



తోటి కేబినెట్ మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేని ఉద్దేశించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం (ఎన్డీయే) నాలుగోసారి అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు కానీ.. ఆయన మాత్రం మరోసారి మంత్రి అవుతారంటూ వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో స్టేజ్‌పై అథవాలే కూడా ఉండటం గమనార్హం. 'మా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వస్తుందని హామీ ఇవ్వలేను.. కానీ రాందాస్ అథవాలే మాత్రం మంత్రి అవుతారని ఖచ్చితంగా హామీ ఇవ్వగలను' అంటూ చమత్కరించారు. ఇది జోక్ మాత్రమే అంటూ చెప్పకొచ్చారు. ఆ సమయంలో స్టేజ్‌పై ఉన్న అథవాలే సరదాగా నవ్వులు చిందించారు. ప్రస్తుతం గడ్కరీ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

## వాస్తవాలను ప్రభుత్వం ఎందుకు దాస్తున్నది

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య పరిస్థితి అధ్యయనం చేయడానికి నిపుణులైన డాక్టర్లతో త్రిసభ్య కమిటీ వేశామన్నారు. గాంధీ దవాఖానకు కమిటీని వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వాస్తవాలను ప్రభుత్వం ఎందుకు దాస్తున్నదని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంత ప్రయత్నించినా వాస్తవాలను దాచలేరన్నారు. వాస్తవ పరిస్థితిని బయటకు తీసుకొచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. గాంధీ సహా రాష్ట్రంలోని దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు నియమించిన బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీకి కాంగ్రెస్ సర్కార్ అడ్డంకులు సృష్టిస్తున్నది. ప్రభుత్వ హాస్పిటళ్లలో పరిస్థితులను అధ్యయనం చేయకుండా నిర్బంధాలకు పాల్పడుతున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ నేటి నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించనుంది.

## అందాల జాన్వీ..

ఆదివారం జరగాల్సిన దేవర ప్రీరిలీజ్ ఈవెంట్ రద్దయిన నేపథ్యంలో ఓ వీడియో విడుదల చేసింది. బ్లూ కలర్ శారీలో చూడ ముచ్చటగా ఉన్న ఈ బ్యూటీ తెలుగు ప్రేక్షకులను ఉద్దేశిస్తూ వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియో జాన్వీ మాట్లాడుతూ.. 'అందరికీ నమస్కారం. ముందుగా నన్ను ఇంతగా స్వాగతించి నా మీద ఇంత ప్రేమని చూపించిన తెలుగు ఆడియెన్స్ అలానే నన్ను జాను పాప అని పిలుస్తున్నందుకు ఎన్టీఆర్ సర్ ఫ్యాన్స్ అందరికీ ధన్యవాదాలు. మీరు అలా నన్ను సొంత మనిషిలా ఫీలవడం నాకెంతో ఆనందంగా ఉంది. మా అమ్మ మీకు ఎంత ముఖ్యమో తెలుసు. అమ్మకు కూడా మీరందరూ అంతే ముఖ్యం. అలానే నాకు కూడా' అంటూచెప్పొచ్చింది. ఇక తనను ఇంతలా సపోర్ట్ చేస్తున్న మీరందరూ గర్వపడేలా ప్రతిరోజు కష్టపడతానని చెప్పకొచ్చిన జాన్వీ... శివ సర్, ఎన్టీఆర్ సర్ ఈ కోసం నన్ను ఎంపిక చేసుకోవడం నా అదృష్టం. మా ఈ ప్రయత్నం మీ అందరికీ నచ్చుతుందనుకుంటున్నాను. నాకు చాలా సహాయపడిన చిత్రబృందానికి థ్యాంక్స్' అని చెప్పకొచ్చింది. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా ప్రస్తుతం వైరల్ అవుతోంది.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు ఎత్తుకెళ్లిన యువకుడు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపోలో చోరీ కలకలం రేపింది. సెప్టెంబర్ 22న అర్ధరాత్రి సమయంలో ఆర్టీసీ బస్సు చోరీకి గురికావడం అందరినీ షాక్ అయ్యేలా చేసింది. దీంతో అధికారులు, సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏకంగా ఆర్టీసీ బస్సునే ఎత్తుకెళ్లిన ఘటన విని ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలోనే డిపో నుండి రెండు కిలో మీటర్ల దూరంలో సోఫీ నగర్ వద్ద బస్సు ప్రమాదానికి గురైంది. దాంతో అక్కడే నిలిచిపోయింది. అది గమనించిన ఆర్టీ సెక్యూరిటీ సిబ్బంది వెంబడించారు. నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే, ఇక్కడ ఏం జరిగిందంటే.. మహారాష్ట్రకు చెందిన గణేష్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఆర్టీసీ డిపో గోడదూకి లోపలిని ప్రవేశించాడు. తాగిన మైకంలో ఆర్టీసీ బస్సును తీసుకెళ్లాడు. అక్కడి నుంచి సోఫీ నగర్ వైపు వెళ్లగా కంచరోని చెరువు సమీపంలో బస్సు ప్రమాదానికి గురైంది. గమనించిన స్థానికులు వెంటనే ఆర్టీసీ కార్యాలయానికి సమాచారం అందించారు.. ఆర్టీ సెక్యూరిటీ సిబ్బంది వెంబడించి కడ్తాల్ గ్రామ సమీపంలో బైపాస్ దగ్గర అతడిని పట్టుకున్నారు. కాగా, పోలీసుల విచారణలో బస్సు ఆగి ఉంటే తీసుకొ చ్చానని నిందితుడు చెప్పినట్టుగా తెలిసింది.



# బీఆర్ఎస్ vs కాంగ్రెస్

### అమృత్ టెండర్లపై రాజకీయ రచ్చ

తెలంగాణ రాజకీయాల్లో అమృత్ టెండర్లపై రాజకీయ రచ్చ కొనసాగుతోంది. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ పథకంలో భారీగా రేవంత్ బంధువులు అక్రమాలకు పాల్పడ్డారన్న కేటీఆర్ ఆరోపణలు పొలిటికల్‌గా కాక పుట్టించాయి. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన సంస్థకు అర్హతలు లేకుండా ఏకంగా రూ.8,888కోట్ల విలువైన టెండర్‌ను అక్రమంగా కట్టబెట్టారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి తన దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. అయితే కేటీఆర్ కామెంట్స్‌కు గట్టిగానే రియాక్ట్ అయ్యారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఆయన ఆరోపణలు నిజమని తేలితే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. అబద్ధమని తేలితే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. ఆరోపణలు నిరూపించకపోతే కేటీఆర్ చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

మరోవైపు అమృత్ టెండర్లలో కుంభకోణం జరిగిందని మరోసారి స్పష్టం చేశారు కేటీఆర్. మంత్రి పొంగులేటి సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని.. దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంలో కుంభకోణం జరగలేదంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు.

**రుజువు చేయాలన్న కోమటిరెడ్డి**

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫైరయ్యారు. దమ్ముంటే కేటీఆర్ తాను చేసిన ఆరోపణలు రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అలా చేస్తే తాము దేనికైనా సిద్ధమే అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదని.. అందుకే కేటీఆర్ ఇష్టమొచ్చినట్టు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పొలిటికల్ ఫైట్ సరికొత్త టర్న్ తీసుకుంది. ఈ విషయంలో కేటీఆర్ దూకుడుగా ప్రదర్శిస్తుంటే... ఆయనకు కౌంటర్ ఇచ్చే విషయంలో కాంగ్రెస్ కూడా తగ్గేదేలే అన్నట్టుగా వ్యవహరిస్తోంది.



ఈ ఎన్నికల్లో ఓడిపోతే మళ్లీ పోటీ చేయను..

## ట్రంప్ కీలక ప్రకటన

అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు మరో 43 రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో ప్రధాన అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ తమ ప్రచార జోరు పెంచారు. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో తాను గెలవకపోతే మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. 'నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో మేం ఓడిపోతామని అస్సలు అనుకోవడం లేదు. ఆ ఆలోచనే లేదు. మేం తప్పకుండా విజయం సాధిస్తామన్న నమ్మకం ఉంది. ఒకవేళ ఓడిపోతే.. 2028 ఎన్నికల్లో నేను బరిలోకి దిగను. ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను' అని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ట్రంప్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కాగా, ట్రంప్ ఇప్పటికే ఓసారి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. 2016 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి ఆయన రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌పై విజయం సాధించారు. ఆ తర్వాత 2020 ఎన్నికల్లో జో బైడెన్‌పై మరోసారి పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ట్రంప్ ఓటమి చవి చూశారు. ఇప్పుడు మరోసారి అధ్యక్ష బరిలో దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.ఇక నవంబర్ 5న అమెరికా 47వ అధ్యక్షుడి కోసం ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ట్రంప్‌కు డెమోక్రటిక్ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో కమలాదే పైచేయి అని అత్యధిక సర్వేలు అంచనా వేస్తున్నాయి. కీలక రాష్ట్రాల్లోనూ కమలా హారిస్‌దే పైచేయి కొనసాగుతోందని సర్వేలు చెబుతున్నాయి. దీంతో ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



బౌద్ధ సన్యాసిగా

## మారిన పిల్లి

మీరు పిల్లి ప్రేమికులా? అవును అయితే ఫర్వాలేదు, కాకపోయినా ఈ వీడియో చూసి మీరు కడుపుబ్బ నవ్వుకోవటం మాత్రం ఖాయం అని చెప్పాలి.. ప్రతి రోజు సోషల్ మీడియాలో పిల్లులు, కుక్కలకు సంబంధించి చాలా వీడియోలు వైరల్ అవుతున్నాయి. అందులో ఈ వీడియో ఒకటి. వీడియో చూసిన తర్వాత ఇలాంటి పిల్లిని ఎప్పుడూ, ఎక్కడా చూడలేదని మీరు ఆశ్చర్యపోతారు. ఎందుకంటే.. ఇక్కడ వైరల్ అవుతున్న వీడియోలో ఒక పిల్లి బౌద్ధ సన్యాసిలా మారింది. ఈ వీడియోను మిసా మాయ అనే యూజర్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. వీడియోలో కనిపిస్తున్న పిల్లి బౌద్ధ సన్యాసి వేషధారణలో ఉంది. మెడలో దండ, ఒంటిపై బౌద్ధ సన్యాసులు వేసుకునే కండువా ధరించి ఉంది. అంతేకాదు.. స్టైల్‌గా కళ్లజోడు కూడా ధరించి ఉంది. ఇక, ఆ పిల్లి పక్కనే ఒక బౌద్ధ సన్యాసి కూడా కూర్చున్నాడు. సన్యాసి పిల్లి ముందు కాలిని తన చేతిలో పట్టుకుని ఏదో మాట్లాడటం కనిపిస్తుంది. పిల్లి కూడా అతని మాటలు చాలా శ్రద్ధగా వింటోంది. గురువు ఎదురుగా బౌద్ధ సన్యాసి ఎలా ప్రశాంతంగా కూర్చుంటాడో, ఈ పిల్లి కూడా అలాగే కూర్చుని ఉంది.

సంక్రాంతికి రాబోతున్న

## మాజాకా

యంగ్ హీరో సందీప్ కిషన్ – దర్శకుడు త్రినాథరావు నక్కిన కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రానికి టైటిల్ ఖారరు చేశారు. ఈ మాస్ ఎంటర్టైనర్ కి 'మాజాకా' అనే పేరు ఖరారు చేశారు. టైటిల్ రివీల్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ విడుదల చేశారు. సందీప్ కిషన్ పెళ్లి కొడుకు గెటప్ లో కనిపించగా.. అతని చుట్టూ పెళ్లి హడావుడి కనిపిస్తోంది. మొత్తానికి ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తో సందీప్ కిషన్ ఆకట్టుకున్నాడు. కాగా ధమాకా తరవాత నక్కిన త్రినాథరావు నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ మజాకా పై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి రాజేష్ దండా నిర్మాత. రాజేష్ దండా నుంచి వచ్చిన 'సామజవరగమన' మంచి విజయాన్ని సాధించింది. ఈ క్రమంలోనే మజాకా కూడా మంచి విజయాన్ని సాధిస్తోందని అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో రావు రమేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే 'మన్మథుడు' ఫేమ్ అన్షు.. రావు రమేష్ కి జోడీగా నటిస్తుంది. కాగా ఈ సినిమా 2025 సంక్రాంతికి థియేటర్లలోకి రానుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రసన్నకుమార్ బెజవాడ ఈ సినిమాకి రచయిత.




## థాయ్ బీచ్‌లో పాయల్ హాట్ షో

పాయల్ రాజ్‌పుత్ వెకేషన్‌లో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా బీచ్‌లో హాట్ డ్రెస్ ధరించి గ్లామరస్ లుక్‌తో అదరగొట్టారు. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ప్రస్తుతం థాయ్‌లాండ్ వెకేషన్‌కు వెళ్లారు. అక్కడి బీచ్‌లో బికినీలో హాట్ అందాలతో ఆకట్టుకున్నారు. సాగరంలో ఆనందంగా గడిపారు. రెడ్ కలర్ లాంగ్ బికినీ డ్రెస్ ధరించారు పాయల్ రాజ్‌పుత్. సముద్రపు నీటిలో సరదాగా ఆడుకున్నారు. కేరింతలు కొట్టారు ఈ ఆర్‌ఎక్స్ 100 భామ. సముద్రతీరాన కెమెరాలకు కిర్రాక్ పాజోలు ఇచ్చారు రాయల్ రాజ్‌పుత్. అట్రాక్టివ్ లుక్‌తో మైమపిరించారు. మెడిటేషన్ చేస్తున్నట్టుగా ఆమె నీటిలో పోజ్ ఇచ్చిన ఫొటో ఇది. ఈ ఫొటోలను నేడు (సెప్టెంబర్ 2) ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు పాయల్ రాజ్‌పుత్. ఈ ఫొటోలకు నెటిజన్లు వావ్ అంటున్నారు. హాట్, గ్లామరస్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. గతేడాది మంగళవారం చిత్రంతో సూపర్ హిట్ కొట్టారు పాయల్ రాజ్‌పుత్. ఈ ఏడాది వచ్చిన రక్షణ చిత్రం ఆకట్టుకోలేకపోయింది.

